# కథ

**-పి. సుభాషిణి**

# ఊరెళ్ళిపోదాం!

**"ఏమయ్యో! ఇక నా వల్ల కాదు. మనం హైదరాబాదెళ్ళిపోవలసిందే"**

**ఖాళీ బస్తాలు లెక్కపెట్టి మూట కడుతూ, మరోవైపు భార్యకేసి ఓరగా చూస్తూనే వున్నాడు ఎలమంద. ఇంట్లోంచి వెళ్ళి గంట తర్వాత నీళ్ళబిందెతో వచ్చాక ఆమె చిరాకుపడుతూనే వుంది. ఆ చిరాకుకి కారణం తెలుసు అతడికి. చివరికి ఆ చిరాకు ఏ మలుపు తిరుగుతుందో కూడా అతడు ఊహిస్తూనే వున్నాడు. అతడి ఊహకు భిన్నంగా ఆమె ప్రవర్తించలేదు. అడగదలచుకున్నది అడిగేసింది.**

ఎప్పటిలాగే అతడూ చిన్నగా నవ్వేసాడు. ''హైదరాబాద్ వెళ్ళి ఏం చేద్దామే సుగుణా! రెండెకరాల నేలుంది. లాభమో నష్టమో ఎంతో కొంత పంట పండుతోంది. కష్టమైనా సుఖమైనా పంచుకునే బంధుమిత్రులున్నారు..''

అతడి మాటల్ని పూర్తిచేయనివ్వలేదామె ''ఎవరుండి ఏం లాభం? నీకేమోగానీ నాకష్టాన్ని పంచుకునే వాళ్ళెవ్వరూ లేరు. ఇంటి ముందు బావి ఎండిపోయింది. బిందెడు మంచినీళ్ళ కోసం ఊరి చివరకు మైలుదూరం వెళ్ళాల్సి వస్తోంది. అంతదూరం వెళ్ళొచ్చేసరికి అలసటొచ్చేస్తోంది. నీకేం ఇంట్లో కూర్చుని ఎన్ని మాటలైనా మాట్లాడుతావ్''

తలనుండి ముఖం మీదకు కారుతున్న చెమట చుక్కల్ని చూస్తుంటే అతడికి కూడా ఆమె మీద జాలేసింది. తను ఆమెమీద జాలిపడగలడేగానీ, మరేం చేయగలడు? ఒకప్పుడు ఊరి చుట్టూ పచ్చని పొలాలుండేవి. వరిపంటకు వర్షం నీరు, మోటార్ బోర్ నీళ్ళు సరిపోయేవి. హఠాత్తుగా 'అక్వాకల్చర్' వచ్చిపడింది. ఇబ్బడి ముబ్బడి లాభాలంటూ వున్న పొలాలను గుంటలుగా మార్చేసి పొలాల చుట్టూ వందల అడుగుల లోతు మోటారు బోర్లు వేసేసారు. దాంతో ఊరి బావుల్లోని నీరుతో సహా మోటారు బోర్‌లు గుంజేసాయి. ఇలా మంచి నీళ్ళ బావులన్నీ ఎండిపోతే గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్ళకోసం ఎంత దూరమయినా వెళ్ళక తప్పదు కదా?

''నేనిలా వాగుతుంటే మాట్లాడవేంటి?''

''మాట్లాడడం వలన ప్రయోజనమేముంటుందే?... ఆలోచించాలి''

''సంవత్సరం నుండి మీరు ఆలోచిస్తూనే వున్నారు. పని మాత్రం జరగట్లేదు'' అనేసి పెరట్లోకి వెళ్ళిపోయింది సుగుణ.

ఎలమంద చాలాసేపు భార్య చెప్పిన విషయం గురించి ఆలోచిస్తూ వుండిపోయాడు. 'ఎందుకో తెలియదు. ఈమధ్య తనకు కూడా హైదరాబాద్ మీద మోజు పెరుగుతోంది. నష్టాలతో, కష్టాలతో ఎంతకాలమని వ్యవసాయం చేస్తాం? చుట్టుపక్కల ఊళ్ళ నుండి సిటీకెళ్ళిన కొంతమంది, బాగా సంపాదించుకున్నారని తను వింటున్నాడు! అందుకే .. పోనీ సుగుణ చెప్పినట్టే హైదరాబాదెళ్ళిపోతే?!'

మరో నెలరోజుల తర్వాత అతడు ఆ నిర్ణయమే తీసుకున్నాడు. అతడి నిర్ణయం విని సుగుణ చాలా సంబరపడింది.

★ ★ ★

స్కూల్‌కెళ్ళే ఇద్దరు పిల్లలతో సహా ఎలమంద, సుగుణలు సిటీ చేరుకున్నారు. ఊరి సర్పంచ్ బంధువుల ద్వారా అతడు ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా జాయినయ్యాడు. పిల్లలు ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో చేరారు.

సిటీకొచ్చిన మొదటిరోజు సుగుణ చాలా సంతోషంగా ఫీలయ్యింది. ''హైదరాబాద్ అంటే మాటలు కాదు. అక్కడ కాపురం పెట్టడమంటే అందరివల్లా కాదు. పాపం! ఆ పల్లెజనమంతా ఇంకా మంచినీళ్ళకోసం ఊరి చివరకు వెళ్తూనే వున్నారు. నేను మాత్రం ఆ సమస్య తప్పించుకున్నాను''

కానీ ఆమె సంతోషం మర్నాటికే ఎగిరిపోయింది. నల్లాలో రెండురోజులకొకసారి రెండు గంటలు నీళ్ళు వస్తాయని హౌస్ ఓనర్ చెప్పాడు. రెండోరోజు అర్థగంట మాత్రమే నల్లాలో నీళ్ళు వచ్చాయి. ఎక్కడో వాటర్ పైపు చెడిపోయిందట. ఆరోజు సాయంత్రం వాటర్ ట్యాంకు వచ్చింది. ఆడాళ్ళే కాదు, మగాళ్ళు కూడా బిందెలు పట్టుకుని వాటర్ ట్యాంకుని చుట్టుముట్టారు. బిందెడు నీళ్ళకోసం తోసుకోవడం, కొట్టుకోవడం, తిట్టుకోవడం సర్వసాధారణ విషయంలా జరిగిపోతున్నాయి.

సుగుణకు తన పల్లె గుర్తుకొచ్చింది ''అక్కడ ఆమడ దూరంలో బిందెడు నీళ్ళు దొరికినా, అందరూ వాటిని పంచుకుంటారే తప్ప, ఇలా బిందెలతో కొట్టుకోరు'' ఆమెకు సిటీలో కనిపించే కామన్ సీన్ చాలా ఇబ్బందిగా అనిపించింది.

ఆ రాత్రి ఆమాటే భర్తతో అంటే అతడు అన్నాడు ''అక్కడ అందరం చిన్నప్పటినుండి కలిసి బ్రతికినవాళ్ళం. అందరి మధ్యా అభిమానం ఆప్యాయతలుంటాయి. ఇక్కడ ఈరోజు ఈ ఇంట్లో వుంటాం. రేపు మరో ఇంటికి మారిపోతాం. మరలాంటప్పుడు మనకు వాళ్ళతో, వాళ్ళకు మనతో పనేముంటుంది? అభిమానం ఆప్యాయతలకు ఆస్కారమెక్కడుంటుంది?''

''అది నిజమే కదా?'' అనుకుంది సుగుణ.

ఐతే రోజులు గడిచేకొద్దీ ఆమెలో ఏదో అసంతృప్తి కదలాడసాగింది.

పల్లెలో ఇరుగుపొరుగు ఇళ్ళమధ్య రాకపోకలు ఎక్కువగా వుంటాయి. పనులయ్యాక మధ్యాహ్నమో, సాయంత్రమో ఒకరింటికి మరొకరు వెళ్ళి కాసేపు కబుర్లు చెప్పుకుంటారు. పల్లెలోకి టి.వి.లు ప్రవేశించినా, మనుష్యుల మధ్య మాటలు పూర్తిగా తగ్గిపోలేదు.

కానీ సిటీలో మనుష్యులు గిరిగీసుకుని బ్రతుకుతున్నట్టుగా అనిపించేది. నల్లా దగ్గరో, కూరగాయల బండిదగ్గరో పక్క పోర్షన్ వాళ్ళు కనిపిస్తే, పలకరిస్తే ముక్తసరిగా మాట్లాడి వెళ్ళిపోయేవారు. 'మా ఇంటికి రండి' అని మాట వరుసకైనా అనేవాళ్ళు కాదు, తను పిలిచినా వచ్చేవారు కాదు.

గలగలా అందరితో మాట్లాడే సుగుణకు మాటలు కరువైన పరిస్థితి మరింత బాధగా అనిపించసాగింది. దాంతో కాలం భారంగా గడవసాగిందామెకు.

★ ★ ★

మధ్యాహ్నం స్కూల్‌నుండి తిరిగి రావడంతోనే కడుపు చేతపట్టుకుని కూలబడిపోయింది అనూష. కూతుర్ని ఆ పరిస్థితిలో

చూసేసరికి సుగుణకు కాళ్ళు చేతులు ఆడలేదు. పరుగు పరుగున పక్క పోర్షన్‌కి వెళ్ళి ''ఏవండీ! మా అమ్మాయి.. మా అమ్మాయి..'' అంటూ విషయం వివరించింది.

''అయ్యో! అలాగా.. వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి'' ఉచిత సలహా ఇచ్చింది ఆ ఇంటి ఇల్లాలు.

ఆ స్థితిలో కూడా అవతలి వైపునుండి వచ్చిన జవాబుకి ఆశ్చర్యపోయింది సుగుణ. తను 'పిల్లదానికిలా వుంది' అని అనడంతోనే, వాళ్ళు తన ఇంటికి పరుగెత్తుకొస్తారని, వెంటబెట్టుకుని హాస్పిటల్‌కి తీసుకెళ్ళడం చేస్తారని అనుకుంది. వాళ్ళలా చేయలేదు. ఉచిత సలహా ఇవ్వడమే గొప్ప అన్నట్టు నిలబడి తన వంకే చూస్తోంది. 'ఇంకా వెళ్ళవేంటి?' అన్నట్టుగా అనిపిస్తున్న ఆ చూపులు చూసాక తనకిక అక్కడ నిలవాలనిపించలేదు. అయినప్పటికీ నోరు తెరిచి అడిగింది. ''అది కాదండీ! నేను సిటీకి కొత్త. పైగా నాకు కంగారుగా వుంది. మీరూ నా తోడొస్తే బాగుంటుందనుకుంటున్నాను''

ఆవిడ ముఖంలో చిన్న మార్పు కదలాడింది. అప్పటికీ ఆ విసుగు కనిపించకుండా జాగ్రత్తపడుతూ ''అయ్యయ్యో!... నాకూ రావాలనే వుందమ్మా. కాని మా ఆయన ఆఫీసు నుండి ఫోన్ చేస్తానన్నాడు. చాలా అర్జెంట్. ఆ ఫోన్ కోసమే ఎదురు చూస్తున్నాను'' చెప్పింది.

సుగుణ ఇక అక్కడ అర క్షణం కూడా నిలబడలేదు. వడి వడిగా ఇంటి వైపు నడిచింది. కూతుర్ని భుజాన వేసుకుని రోడ్డుమీద పడింది. ఆ క్షణం ఆటో ఎక్కాలన్న ఆలోచన కూడా రాలేదు. రోడ్డుకి అటు ఇటు చూస్తూ కనిపించిన హాస్పిటల్‌లోనికి వెళ్ళిపోయింది.

డాక్టర్లు పాపను పరీక్షించి ''భయపడాల్సిన పనిలేదు'' అని చెప్పాక, స్థిమితపడి, భర్తకు ఫోన్ చేసింది.

మరో గంటకు ఎలమంద హాస్పిటల్‌కి చేరుకున్నారు. ఆమె వంటిమీద నగలు మార్వాడీ కొట్టులో పెట్టి డబ్బు తెచ్చి హాస్పిటల్ బిల్లులు కట్టసాగారు.

మర్నాటికి అనూష కోలుకుంది. డిశ్చార్జ్ చేశాక కూతుర్ని ఇంటికి తీసుకొచ్చింది.

అయితే అప్పటినుండే సుగుణ మనసులో ఓ భయం మొలకెత్తి మెల్లగా పెరిగిపోసాగింది. 'సిటీకొచ్చాం. ఏదోలా బ్రతికేస్తున్నాం. కాని ఇక్కడ, ఈ మహానగరంలో మా కష్టసుఖాల్లో పాలుపంచుకునే వాళ్ళెవరున్నారు?...'

అది అర్థరహితమైన భయం కాదు. ఆ భయంలో అర్థముంది. దాని గురించి ఆలోచించవలసిన అవసరమూ వుంది.


సిటీలో బ్రతికే చాలామంది మనసుల్లో గూడుకట్టుకుని వుండే భయమే అది. కానీ ఉరుకులు, పరుగుల మధ్య ఆ భయం గురించి జనం ఆలోచించడం మానేసారు. కానీ విధి అప్పుడప్పుడు కొందరినైనా ఆ భయం గురించి తీవ్రంగా ఆలోచించుకునేలా చేస్తోంది.

★ ★ ★

ఆ రోజు శెలవు కావడంతో ఎలమంద ఇంట్లోనే వున్నాడు. సాయంత్రంగా సుగుణ భర్తతో అంది ''ఏమయ్యో! మనిద్దరం అలా మార్కెట్‌కి వెళ్ళివద్దామా?''

''అలాగే''

సుగుణ చేతిసంచి పట్టుకుంది. ఇద్దరూ ఇంట్లోంచి బయటకు నడిచారు. ఇంటికి, మార్కెట్‌కి అర్ధకిలోమీటరు దూరం ఉంటుంది. వారానికోసారి ఇద్దరూ మార్కెట్ వరకూ వెళ్ళి వారానికి సరిపడా కూరగాయలు తెచ్చుకోవడం అలవాటే.



ఇద్దరూ మార్కెట్‌కి చేరుకున్నారు. సుగుణ బేరమాడి కూరగాయలు కొని, వెనుతిరిగింది. కూరగాయల సంచి ఆమె చేతిలోనే వుంది. ఎలమంద ఆమె పక్కనే నడుస్తున్నాడు.

మార్కెట్ నుండి బయటపడి పదడుగులేసాక, మెయిన్‌రోడ్ వస్తుంది. ఆ రోడ్ దాటితే, సందుల వెంట ఇల్లు చేరుకోవచ్చు.

ఎలమంద రోడ్డుకు ఓవైపు నిలబడి అటునిటు చూసాడు. వాహనాలేవి రావడం లేదని నిర్ణయించుకున్నాక, భార్య చెయ్యి పట్టుకుని వేగంగా నడుస్తూ రోడ్ క్రాస్ చేయబోయాడు.

అయితే అతడు తను నిలబడిన రోడ్ వెనుక వైపు చూసుకోవడం మరిచాడు. మూడు దిక్కులు మాత్రమే పరిశీలించి ముందుకు అడుగేయబోవడంతో వెనుక నుండి వస్తున్న ఆటోని చూసుకోలేదు.


రోడ్డు పక్కగా నిలబడి వున్న వాళ్ళిద్దరూ అంత హఠాత్తుగా రోడ్డుమీదకు వస్తారని తెలియకపోవడంతో ఆటోడ్రైవర్ కూడా కంగారు పడ్డట్టుంది. ఆ కంగారులో వాళ్ళని తప్పించాలనే ప్రయత్నంలో ఆటోను మరో పక్కకు తిప్పాడు. అలా తిప్పుతూ బ్రేక్ వేయడంతో ఆటో తిరగబడింది. ఆటో డ్రైవర్ ఎగిరి వెళ్ళి డివైడర్ పోల్‌కి కొట్టుకున్నాడు.

ఏం జరిగిందో అర్థం చేసుకుని వెనుతిరిగి చూసేటప్పటికి ఆటోడ్రైవర్ రక్తపుమడుగులో పడి కొట్టుకోవడం కనిపించింది. వాళ్ళిద్దరూ అటు నడిచారు. జనం కూడా క్షణాల్లో మూగారు. పోలీసులు వచ్చేసారు.

అతడిని అక్కడ్నుంచి పక్కనే వున్న గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.

ఎలమంద, సుగుణలకు మనసంతా ఏదోలా అయిపోయింది. ఆ డ్రైవర్ వెంట తామూ హాస్పిటల్‌కి వెళ్ళాలనే అనుకున్నారు. కానీ ఏదో తెలియని భయం. అక్కడ మూగిన వాళ్ళందరూ తమనే అదోలా చూస్తుండడంతో కలిగిన అపరాధభావం ఇక అక్కడ ఉండనివ్వలేదు. ఎంత త్వరగా అక్కడినుండి తప్పుకుందామా అనిపించింది. అందుకే పోలీసులు అతడిని హాస్పిటల్‌కి తరలించగానే, వాళ్ళిద్దరూ ఇంటికి చేరుకున్నారు.

ఇంటికి చేరుకున్నారన్నమాటేగాని, వారిద్దరికీ మనసు అటే లాగుతోంది. 'తమను తప్పించాలనే ఉద్దేశ్యంతోనే అతడు రిస్క్‌లో పడ్డాడని తెలుసు. మరి ఇప్పుడు అతడి పరిస్థితి ఎలా వుందో ఏమో?' ఆ రాత్రి వారిద్దరికీ నిద్రపట్టలేదు.




మర్నాడు సుగుణ భర్తతో అంది. ''ఏమండీ! మనవల్ల ప్రాణాపాయం కొనితెచ్చుకున్న ఆ ఆటోడ్రైవర్ పరిస్థితి ఎలా వుందో తెలియక మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది. పోనీ మనమోసారి హాస్పిటల్‌కి వెళ్ళి అతడిని చూసి వద్దామా?''

అతడి మనసులోను అదేభావం కదలాడుతోంది. అందుకే అతడు వెంటనే అన్నాడు. ''నాకూ అలాగే అనిపిస్తోంది. మనం వెళ్ళి ఓసారి అతడ్ని చూసొద్దాం''

ఆమె తలాడించింది. పావుగంట తర్వాత వాళ్ళిద్దరూ హాస్పిటల్‌లో వున్నారు. అక్కడ పేషెంట్ వివరాలు చెప్పి ఎంక్వయిరీ చేసారు. వివరాలన్నీ విన్నాక ఓ నర్స్ చెయ్యెత్తి, వార్డు చివర ఓ మూలకు చూపించింది.

ఆ వార్డులో ఓ మూల బెడ్ మీద వుందా ఆకారం. బెడ్‌కి పక్కనే బిక్కుబిక్కుమంటూ చూస్తున్న పాతికేళ్ళ యువతి.

వాళ్ళిద్దరూ అటువైపు అడుగులేసారు.

ఆ యువతి వారికేసి ప్రశ్నార్థకంగా చూసింది.

''అతడికి తెలిసినవాళ్ళం'' చెప్పాడు ఎలమంద.

సరిగ్గా అదే క్షణం- పడుకున్న ఆకారంలో చిన్న కుదుపు. రెండు క్షణాల తర్వాత ఆ కుదుపు ఆగిపోయింది.

ఏం జరిగిందో అర్థం కావడంతో ఆ యువతి పెద్దగా ఏడవసాగింది.

ఎలమంద, సుగుణల కళ్ళు చెమ్మగిల్లాయి. కొద్ది నిముషాలపాటు ఏం చేయాలో పాలుపోలేదు. ఆ తర్వాత కర్తవ్యమూ గుర్తుకొచ్చింది.

కాసేపాగాక ''ఏమ్మా! ఎవరికైనా తెలియజేయవలసి వుందా?'' అడిగాడు ఎలమంద.

''ఎక్కడి నుంచో పొట్ట చేత పట్టుకుని సిటీకొచ్చాం. ఒకరికొకరమే తప్ప, ఇంకెవరూ మాకు లేరు. శవాన్ని నాలుగొందల మైళ్ళు తీసుకెళ్ళడమూ సాధ్యం కాదు'' ఆమెకు తమ పరిస్థితి గుర్తుకు రావడంతో ఏడుపు మరింత పెద్దదయ్యింది.

వారిద్దరూ ముఖాలు చూసుకున్నారు. ఆ యువతికి అండగా వుండాలని నిర్ణయించుకున్నారు.

శవాన్ని ఇంటికి తీసుకెళ్ళడం నుండి, స్మశానానికి తరలించడం ఖననం చేయించడం వరకూ ఎలమందనే దగ్గరుండి చేసాడు.

ఆ తతంగం అయ్యాక దంపతులిద్దరూ ఇల్లు చేరుకున్నారు.

భోజనాలయ్యాక అలసటగా పడుకున్నా, నిద్రరాలేదు ఎలమందకు. చాలాసేపటి తర్వాత తల పక్కకు తిప్పి చూస్తే సుగుణ కూడా పైకప్పుకేసి చూస్తూ కనబడింది.

''నిద్రపట్టలేదా?'' అడిగాడు ఎలమంద.

''లేదు''

''ఎందుకని?''

''ఈ నగరంలో లక్షలమంది జనం వున్నారు. వాళ్ళలో బంధుమిత్రులు అందరికీ వుంటారని అనుకోను. ఎక్కడినుంచో వచ్చిన ఒంటరివాళ్ళు, ఒకరికొకరు మాత్రమే వున్న వాళ్ళు ఎక్కువమందే వుంటారు. అలాంటివాళ్ళకు అనుకోని ఆపద ఎదురైతే, మానవత్వంతో స్పందించే జనం వున్నారా? ఒకవేళ వున్నా అందరికీ దొరుకుతారా?...''

''అలా దొరికేలా వుంటే ఈ మహానగరంలో అనాథ శవాలు, స్మశానానికి ఒంటరి ప్రయాణాలు వుండవు కదా? అనాథ శవాల సంఖ్య, ఒకరిద్దరు మాత్రమే తోడొచ్చే అంతిమయాత్రల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోందని వింటూ వున్నారు''

''అదే పల్లెల్లోనైతే ఒక్కడికి ఏదైనా జరిగితే వందమంది మూగుతారు. స్మశానం వరకూ కనీసం పదిమందయినా వస్తారు''

''అవును''

చాలాసేపు నిశ్శబ్దం తర్వాత సుగుణ అంది ''ఊళ్ళో నీళ్ళు లేని బావి వుంటే, ఊరి చివరికెళ్ళి నీళ్ళు తెచ్చుకోవచ్చు. కానీ మనవాళ్ళంటూ ఎవ్వరూ లేని ఊళ్ళో చివరి క్షణాలు గడపడం కష్టమేనయ్యా!''

''నిజమే''

సుగుణ మెల్లగా గొణిగింది ''మనం మనూరు వెళ్ళిపోదామయ్యా!''

☆